

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, మే 20: 2024-25/26 విద్యా సంవత్సరానికి ఐటీఐ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్, ఐటీఐ ప్రిన్సిపాల్ నరేంద్రబాబు తెలిపారు. హెచ్‌టీటీపీః//ఐటీఐ.టీఈఎల్ఏఎన్‌జీఏఎన్ఏ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్ నందు ఆన్‌లైన్‌లో మే21 నుంచి జూన్16 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.. పది, 8వ తరగతుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9177472488, 8555865421 నెంబర్లను సంప్రదించాలన్నారు.



గుండ్లపోచంపల్లిలో తెరపైకి అవిశ్వాసం

- వేర్వేరుగా విహారయాత్రకు బయల్దేరిన బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు
- బెడిసికొడుతున్న కాంగ్రెస్ ప్రయత్నాలు

మేడ్చల్‌టౌన్, మే 20: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ ఛైర్మన్‌పై అవిశ్వాసం పెట్టడానికి కాంగ్రెస్ నేతలు చేస్తున్న ప్రయత్నాలు బెడిసికొడుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన నాటి నుంచి అధికార కాంగ్రెస్‌పార్టీ గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీపై గురిపెట్టినా ప్రయోజనం చేకూరడం లేదు. ఎమ్మెల్యే మల్లారెడ్డి బావమరిది శ్రీనివాస్‌రెడ్డి సతీమణి మద్దుల లక్ష్మి ఛైర్‌పర్సన్‌గా ఉన్నందున ఆమెను గద్దె దింపాలని కాంగ్రెస్ నేతలు పలు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ప్రయోజనం చేకూరటం లేదు. మొత్తం 15 మంది కౌన్సిలర్లు ఉన్న మున్సిపాలిటీలో ఇద్దరు బీజేపీ, ఒకరు కాంగ్రెస్, 12మంది బీఆర్‌ఎస్‌కు చెందిన వారు ఉన్నారు. కాగా పార్లమెంట్ ఎన్నికల ముందు ఇద్దరు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో, మరో ఇద్దరు బీజేపీలో చేరారు. బీఆర్‌ఎస్‌లో ఎనిమిది మంది కౌన్సిలర్లు మాత్రమే మిగిలారు. పలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో అవిశ్వాసం కోసం కాంగ్రెస్ పావులు కదుపుతుండటంతో ముందు జాగ్రత్తగా ఛైర్‌పర్సన్ భర్త మద్దుల శ్రీనివాస్‌రెడ్డి కౌన్సిలర్లతో విహారయాత్రకు బయల్దేరారు.

విహారయాత్రకు మున్సిపల్ వైస్‌ఛైర్మన్


బ్యాంకాక్ విహారయాత్రకు వెళ్లిన వారిలో ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన మున్సిపల్ వైస్‌ఛైర్మన్ ప్రభాకర్ ఉండటం ఆసక్తికరంగా మారింది. ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వైస్‌ఛైర్మన్ ప్రభాకర్ తమ పార్టీలో రావటంతో ఛైర్మన్‌పై అవిశ్వాసం పెట్టడం సులభంగా మారుతుందని కాంగ్రెస్ నేతలు భావించినప్పటికీ ప్రభాకర్ మాత్రం ఛైర్‌పర్సన్ భర్తతో టూర్‌కు వెళ్లడం కాంగ్రెస్ నేతలకు షాక్‌కు గురి చేసింది. అవిశ్వాసం కోసం కాంగ్రెస్ నేతల చేస్తున్న ప్రయత్నాలను ముందుగానే పసిగట్టిన బీజేపీకి చెందిన నలుగురు కౌన్సిలర్లు నార్త్ ఇండియాలోని పలు పుణ్యక్షేత్రాలను దర్శించుకోవడానికి బయల్దేరారు. అవిశ్వాసం కోసం అవసరపడే మెజారిటీ కౌన్సిలర్లను అందుబాటులో లేకుండా చేయడానికి బీజేపీ నేతలువిహారయాత్రకు వెళ్లినట్లు తెలిసింది.

కాంగ్రెస్ నేతలకు చిక్కని మల్లారెడ్డి బావమరిది

ఎమ్మెల్యే మల్లారెడ్డి విద్యాసంస్థలు మున్సిపాలిటీ పరిధిలో ఉన్నందున ఎట్టి పరిస్థితుల్లో అవిశ్వాసం పెట్టనీయకుండా మల్లారెడ్డి బావమరిది శ్రీనివాస్‌రెడ్డి ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక కౌన్సిలర్ తప్పా బీజేపీ కౌన్సిలర్లు ముందునుంచి ఛైర్‌పర్సన్‌కు విధేయులుగా ఉన్నారు. దీంతో ఎట్టి పరిస్థితుల్లో ఛైర్‌పర్సన్‌పై పెట్టే అవిశ్వాసానికి మద్దతు ఇవ్వరాదనిప్రచారం కొనసాగుతోంది. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు అవిశ్వాసానికి విముఖత చూపుతున్నట్లు తెలిసింది.

పాఠ్య పుస్తకాలు వచ్చేశాయ్!

కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ అయ్యే విధంగా విద్యా శాఖ చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సకాలంలో పాఠ్య పుస్తకాలు సరఫరా కాక వారి చదువులపై ప్రభావం చూపేది. విడతల వారీగా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. ప్రతీ ఏటా ఇదే సమస్య పునరావృతం అవుతుండడంతో సీరియస్‌గా తీసుకున్న విద్యా శాఖ ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలని నిర్ణయించింది.



- మేడ్చల్ జిల్లాలో 3,14,905 లక్షల పుస్తకాలు పాఠశాలలకు పంపిణీ
- పాఠశాలలు తెరిచే నాటికి పంపిణీకి సిద్ధం
- ఈనెలాఖరు వరకు లక్ష్యం మేరకు సరఫరా అయ్యే అవకాశం
- పార్ట్-1, పార్ట్- 2 గా విభజన.. స్కూళ్ల ప్రారంభం రోజున విద్యార్థులకు అందజేత

ఇప్పటికే మేడ్చల్‌కు 54శాతం, వికారాబాద్ జిల్లాకు చేరిన 49.34 శాతం

2 నుంచి 9 వరకు ద్విభాషా పుస్తకాలు

మేడ్చల్ జిల్లాలోనిప్రభుత్వ పాఠశాలల్లో చదివే 1వ తరగతి విద్యార్థులకు పూర్తిగా ఇంగ్లీష్ మీడియం పుస్తకాలను అందిస్తున్నారు. 2 నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ద్విభాషా పుస్తకాలను అందిస్తున్నారు. మొదటి విడతలో పార్ట్-1 పుస్తకాలను జూన్ 12న అందించనున్నారు. పార్ట్-1 విభాగంలో 1వ తరగతి విద్యార్థులకు పూర్తిగా ఇంగ్లీష్ మీడియం మొత్తం పుస్తకాలు, రెండు నుంచి 9వ తరగతి విద్యార్థులకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ లాంగ్వేజ్‌లతో పాటు ద్విభాషా పుస్తకాలు 50 శాతం ఆప్షన్స్ సబ్జెక్టులు(మ్యాథ్స్, సైన్స్, సోషల్) పుస్తకాలను, 10వ తరగతి విద్యార్థులకు తెలుగు మీడియం, ఇంగ్లీష్ మీడియం మొత్తం పుస్తకాలను అందిస్తున్నారు. పార్ట్-2 విభాగంలో 2వ తరగతి నుంచి 9వ తరగతి వరకు సగం సిలబస్ పూర్తయిన తర్వాత మిగిలిన 50 శాతం ఆప్షన్ సబ్జెక్టుల పుస్తకాలను అందించనున్నారు.



పుస్తకాలను పరిశీలిస్తున్న అధికారులు

వికారాబాద్/మేడ్చల్ మే 20 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలు ప్రారంభించే నాటికి పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. విద్యా శాఖ రాష్ట్ర పాఠ్య పుస్తకాల ముద్రణాలయం నుంచి జిల్లా కేంద్రాలకు ఆర్టీసీ కార్గో బస్సుల ద్వారా పాఠ్య పుస్తకాలను సరఫరా చేస్తున్నారు. వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, స్థానిక సంస్థలకు సంబంధించి 1023 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలలే కాకుండా 18 కేజీబీవీలు, 9 ఆదర్శ పాఠశాలలు, 34 గురుకుల పాఠశాలలు ఉన్నాయి. కొత్త విద్యా సంవత్సరంలో జిల్లాకు మొత్తం 7,19,410 పాఠ్య పుస్తకాలు అవసరం ఉండగా, వాటిలో గత ఏడాదికి సంబంధించిన 34,000 పాఠ్య పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఈ పుస్తకాలు మినహాయిస్తే ఇంకా 6,85,410 పాఠ్య పుస్తకాలు సరఫరా చేయాల్సిన డిమాండ్ ఉంది. కాగా, ఈ పాఠ్య పుస్తకాల్లో 5,27,030 పార్ట్-1 పాఠ్య పుస్తకాలను పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి సరఫరా చేయాల్సి ఉండగా, 2,60,030 పార్ట్-1 పాఠ్య పుస్తకాలను జిల్లా కేంద్రానికి సరఫరా చేశారు. ఇంకా 2,67,000 పార్ట్-1 పాఠ్య పుస్తకాలు ముద్రణాలయం నుంచి జిల్లాకు సరఫరా కావాల్సి ఉంది. ఇప్పటి వరకు జిల్లాకు సరఫరా కావాల్సిన పార్ట్-1 పాఠ్య పుస్తకాల్లో 49.34 శాతం వచ్చాయి. జిల్లాకు 185 టైటిల్స్ పాఠ్య పుస్తకాలు సరఫరా కావాల్సి ఉండగా, ఇప్పటి వరకు 77 టైటిల్స్ పాఠ్య పుస్తకాలు సరఫరా చేశారు. జిల్లా కేంద్రానికి వచ్చిన పాఠ్య పుస్తకాలను శివారెడ్డిపేటలో ప్రభుత్వ పాఠ్య పుస్తకాల సరఫరా కేంద్రంలో భద్రపరిచారు. విద్యార్థులకు విద్యా సంవత్సరం ప్రారంభం రోజు ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసే విధంగా విద్యా శాఖ చర్యలు చేపట్టింది. జిల్లాలో తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మీడియం ప్రభుత్వ పాఠశాలలు ఉండడంతో ఆ మూడు మీడియాలకు సంబంధించిన పాఠ్య పుస్తకాలను సరఫరా చేస్తున్నారు. ఈనెలాఖరులోగా జిల్లాకు అవసరమైన పాఠ్య పుస్తకాలు సరఫరా అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. జూన్ మొదటి వారంలో మండలాల వారీగా మండల వనరుల కేంద్రాలకు సరఫరా చేసి అక్కడి నుంచి పాఠశాలలకు పాఠ్య పుస్తకాలను తరలించాలని విద్యా శాఖ అధికారులు యోచిస్తున్నారు. జిల్లాకు ఎన్ని పాఠ్య పుస్తకాలు అవసరం ఉంటే ఇంత వరకు ఎన్ని సరఫరా చేశారనే విషయమై డీఈవో రేణుకాదేవి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. మేడ్చల్ జిల్లాలో ఈ ఏడాది 2వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు ద్విభాషా పుస్తకాలు(ఒకే పుస్తకంలో ఒకవైపు ఇంగ్లీషు మీడియం మరోవైపు తెలుగు మీడియం పాఠాలు) అందించనున్నారు. పేజీల సంఖ్య, బరువు పెరగడంతో ఆప్షన్స్ సబ్జెక్టులను(మ్యాథ్స్, సైన్స్, సోషల్) పార్ట్ 1, పార్ట్ 2 గా విభజించి విద్యార్థులకు అందించనున్నారు. మొదటి విడతగా పార్ట్ - 1 పుస్తకాలు బడులు ప్రారంభోత్సవం రోజు జూన్12న విద్యార్థులకు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పార్ట్-2 పుస్తకాలను అక్టోబరులో ఇవ్వనున్నారు.



శివారెడ్డిపేటలో పాఠ్య పుస్తకాల సరఫరా కేంద్రంలో భద్రపరిచిన పాఠ్యపుస్తకాలు

నోట్ పుస్తకాలు కూడా ...

ఇదిలా ఉంటే, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు గత ఏడాది నుంచి రాష్ట్ర ప్రభుత్వం నోట్ పుస్తకాలు కూడా ఉచితంగా సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. వికారాబాద్ జిల్లాకు ఈ ఏడాది 4,60,422 నోట్ పుస్తకాలు అవసరమని విద్యా శాఖ గుర్తించింది. సింగిల్ రూల్ నోట్ పుస్తకాలు 83,470, ప్లెయిన్ నోట్ పుస్తకాలు 3,76,952 అవసరం కాగా, ఇప్పటి వరకు 64 వేల నోట్ పుస్తకాలు జిల్లాకు వచ్చాయి. జిల్లాకు సరఫరా చేసిన నోట్ పుస్తకాల్లో 20 వేలు సింగిల్ రూల్ నోట్, 44 వేలు ప్లెయిన్ నోట్ పుస్తకాలు ఉన్నాయి. మిగిలిన నోట్ పుస్తకాలు ఈనెలాఖరులోగా సరఫరా అయ్యే అవకాశం ఉంది.

5,75,986 లక్షల పుస్తకాలు అవసరం

మేడ్చల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో పాటు కేజీబీవీ, రెసిడెన్షియల్, మైనార్టీ గురుకులాల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే మొత్తం విద్యార్థులు 98,733 వేల మంది ఉన్నారు. వీరికి 5,75,986 పుస్తకాలు అవసరం. ఇప్పటి వరకు జిల్లాలకు పుస్తకాలు 54 శాతం చేరాయి. వచ్చిన పుస్తకాలను ఆయా మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు పంపించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బడులు ప్రారంభమైన రోజే విద్యార్థుల చేతిలో పుస్తకాలు ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

స్కూళ్ల ప్రారంభం నాటికి విద్యార్థుల చేతిలో పుస్తకాలు



ఈ విద్యా సంవత్సరం బడులు ప్రారంభమైన రోజు నాటికి విద్యార్థుల చేతిలో పుస్తకాలు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. మొదటి విడతలో 54 శాతం వరకు పుస్తకాలు వచ్చాయి. ఇంకో పది రోజుల్లో వంద శాతం పుస్తకాలు వస్తాయి. వీటిని జూన్ 11లోపు అన్ని పాఠశాలలకు చేరవేస్తాం. రెండో విడత పుస్తకాలు అక్టోబరులో అందిస్తాం.

- విజయకుమారి, మేడ్చల్ జిల్లా విద్యాధికారి

పాఠశాలలకు చేరవేస్తున్నాం

మేడ్చల్ జిల్లాకు ఇప్పటికే దాదాపు 54 శాతం పుస్తకాలు వచ్చాయి. పుస్తకాలు జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు చేరవేస్తున్నాము. మరో 10 రోజుల్లో మిగిలిన పుస్తకాలు రానున్నాయి. రాగానే మిగిలిన పుస్తకాలను పాఠశాలలకు పంపిణీ చేస్తాం. విద్యాసంవత్సరం ప్రారంభానికి పాఠశాలల్లో వంద శాతం పుస్తకాలు సిద్ధంగా ఉంటాయి.

- సునీల్, మేడ్చల్ జిల్లా పాఠ్యపుస్తక కేంద్ర నిర్వాహకులు

పాఠశాలల వివరాలు

పాఠశాలలు	వికారాబాద్	మేడ్చల్
ప్రాథమిక	33	375
ప్రాథమికోన్నత	116	22
ఉన్నత	174	108
ఎయిడెడ్	09	10
గురుకులాలు	61	--

పుస్తకాల వివరాలు

జిల్లాల వారీగా	వికారాబాద్	మేడ్చల్
కావాల్సిన పాఠ్య పుస్తకాలు	7,19,410	5,75, 986
గతేడాది మిగిలిన పుస్తకాలు	34,000	24,000
సరఫరా కావాల్సిన పుస్తకాలు	5,27,030	2,61,081
సరఫరా చేసినవి	2,60,030	3,14,905

బోనస్‌తో మరింత 'సాగు'

- 'సన్నా'లకు ప్రోత్సాహకం
- రూ.500 బోనస్ ఇవ్వాలని సర్కార్ నిర్ణయం
- ఈ సీజన్‌లో పెరగనున్న వరి సాగు



ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 20: రాష్ట్ర అవసరాలకు సరిపడా సన్న బియ్యాన్ని స్థానిక రైతుల నుంచే సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సన్న రకం వరి సాగు చేసే రైతులకు బస్తాకు రూ. 500 బోనస్‌గా ఇవ్వాలని నిర్ణయించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం తెల్లరేషన్ కార్డుదారులతో పాటు హాస్టళ్లకు, మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యం ఇవ్వాలని నిర్ణయించింది. అయితే డిమాండ్‌కు తగ్గ సన్నబియ్యం అందుబాటులో లేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీన్ని అధిగమించేందుకు స్థానిక రైతులను ప్రోత్సహించి సన్నధాన్యం సాగు పెంచాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా సన్నరకాల వరిని సాగు చేసే రైతులకు బోనస్ ఇస్తున్నట్లు ప్రకటించింది. సర్కార్ తాజా ప్రకటనతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఈ వానాకాలం వరి సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే బియ్యం ధరలకు రెక్కలు రావడంతో ఉమ్మడి జిల్లాలో గత ఖరీఫ్, రబీ సీజన్‌లలో వరి సాగు గణనీయంగా పెరిగింది. ఇపుడు ప్రభుత్వం సన్నబియ్యం సాగు చేసే రైతులకు అదనంగా మరో రూ. 500 బోనస్ ఇస్తామని ప్రకటించడంతో ఉమ్మడి జిల్లాలో సన్నరకాల వరి సాగు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. సాధారణంగా ఉమ్మడి జిల్లాలో వానాకాలం సగటు దాదాపు 1.72లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తుంటారు. అయితే గత ఏడాది రికార్డు స్థాయిలో 2.78లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. అలాగే యాసంగి (రబీ)లో కూడా రికార్డు స్థాయిలో వరి సాగు జరిగింది. రబీలో సాధారణంగా 1.07లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా గడిచిన రబీలో రెట్టింపు స్థాయిలో 2.14లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. యాసంగిలో రంగారెడ్డి జిల్లాలో 74.050 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా అంతకు మించి 188.23శాతం అంటే 1,39,386 ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో వరి 52,470 ఎకరాల్లో సాగు చేయాలని నిర్ణయించగా రికార్డుస్థాయిలో రబీలో 1,12,926 ఎకరాల్లో వరి సాగు చేశారు. అలాగే వికారాబాద్‌లో రబీ సీజన్‌లో 87,694 ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా 1,30,514 ఎకరాల్లో పంటలు వేశారు. ఇందులో వరి 87,188 ఎకరాల్లో సాగు చేశారు. అలాగే మేడ్చల్ జిల్లాలో రబీ సీజన్‌లో మొత్తం పంటల సాగు 10,132 ఎకరాల లక్ష్యం కాగా అంతకు మించి 16,333 ఎకరాల్లో పంటలు వేశారు. ఇందులో 13.991 ఎకరాల్లో వరి సాగు చేశారు.

దిగుబడి తగ్గినా రాబడి ఎక్కువే

సాధారణంగా దొడ్డు రకాలతో పోలిస్తే వరి సన్నాలకు దిగుబడులు తక్కువే. దొడ్డు రకాలు సగటు ఎకరానికి 30 నుంచి 35 బస్తాల వరకు దిగుబడి వస్తుంది. కొన్ని ప్రాంతాల్లో 40 బస్తాలు కూడా రైతులు పండిస్తున్నారు. అదే సన్న రకాలైతే ఎకరానికి సగటున రెండు నుంచి మూడు క్వింటాళ్ల దిగుబడి తక్కువగా ఉంటుంది. దొడ్డు రకాలతో పోలిస్తే సాగు సమయంతో పాటు చీడపీడలు బెడద కూడా ఎక్కువే. అయితే ధర విషయానికి వచ్చేసరికి సన్నాలకు విపరీత డిమాండ్ ఉంటుంది. దొడ్డు రకాలతో పోలిస్తే సన్నా రకాలకు క్వింటాల్‌కు రూ. 500 నుంచి 600 అధిక ధర లభిస్తుంది. ఈ రబీలో సన్నాలు సాగు చేసిన రైతులంతా తమ పొలాల వద్దే పంటను అధిక ధరకు అమ్మేశారు. దొడ్డు రకాలు క్వింటాల్‌కు రూ.1,850కు కొనుగోలు చేస్తుండగా సన్నాలు ఇపుడు మార్కెట్‌లో రూ.2,400కు పైగా అమ్ముడవుతున్నాయి. మార్కెట్‌కు తీసుకు వెళ్లకుండానే పొలాల వద్దే ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి అవసరమైన సన్నబియ్యం మార్కెట్‌లో దొరకడం లేదు. ఈ కారణంగా ప్రభుత్వం సన్న రకాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయించింది.

మూడు జిల్లాల్లో గత వానాకాలం వరిసాగు (ఎకరాల్లో)

జిల్లా	సాగు లక్ష్యం	వాస్తవసాగు విస్తీర్ణం
రంగారెడ్డి	79,218	1,30,049
వికారాబాద్	77,554	1,30,835
మేడ్చల్	15,066	17,861
గత యాసంగి వరిసాగు (ఎకరాల్లో)		
రంగారెడ్డి	52,470	1,12,926
వికారాబాద్	45,620	87,188
మేడ్చల్	9,745	13,991

ధ్రువపత్రాల జారీ సులభతరం

- మీ -సేవ కమిషనర్ రవికిరణ్



మాట్లాడుతున్న మీ సేవ కమిషనర్ రవికిరణ్

మేడ్చల్ మే 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మీ సేవల ద్వారా జారీ చేసే ధ్రువపత్రాలను ఇక నుంచి సులభంగా జారీ చేయడానికి అవసరమైన మార్పులు చేయడం జరుగుతుందని మీ సేవ కమిషనర్ రవికిరణ్ పేర్కొన్నారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి మండల పరిధిలో మీ సేవ ద్వారా వివిధ ధ్రువపత్రాలు జారీ చేసే ప్రక్రియలో సమస్యలను తహసీల్దార్లు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ధ్రువపత్రాలను సులభతరంగా జారీ చేయడానికి మార్పులు, చేర్పులు చేయడం జరుగుతుందన్నారు. కాగా టీఎస్ స్థానంలో టీజీ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో జిల్లాలోని అన్ని శాఖల ఉన్నతాధికారులు తక్షణమే ఉత్తర్వులను అమలు చేయాలని కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ శాఖల ద్వారా నిర్వహించే ఉత్తర, ప్రత్యుత్తరాలలో టీఎస్‌కు బదులుగా టీజీని రాయాలని ఆయన సూచించారు. కార్యక్రమల్లో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్ఓ హరిప్రియ పాల్గొన్నారు.

ఊపిరి తీస్తున్న పిడుగులు!

- పలు చోట్ల ఉరుములు మెరుపులు, ఈదురుగాలుల వాన
- పిడుగులు పడి ఇద్దరు వ్యక్తులు, ఐదు మేకలు, గేదె మృతి
- తడిసిన ధాన్యం.. దెబ్బతిన్న ఉల్లి పంట
- విరిగిపడిన చెట్లు, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
- నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

తాండూరురూరల్/కొడంగల్‌రూరల్/ బొంరాస్‌పేట్/ మర్పల్లి/ కొడంగల్/ దౌల్తాబాద్/తాండూరు/ యాలాల, మే20 : వికారాబాద్ జిల్లాలో సోమవారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. తాండూరు మండలంలోని నారాయణపూర్, మల్కాపూర్, సంకిరెడ్డిపల్లి గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. గోనూరు, చెంగోల్, బెల్కటూర్‌లో వరి కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడిసిపోయింది. గౌతాపూర్‌గ్రామ శివారులో మూడు చెట్లు నేలకొరిగాయి. దుద్యాల మండల వ్యాప్తంగా సోమవారం సాయంత్రం భారీ వర్షంతో పాటు అక్కడక్కడ వడగండ్ల వర్షం కురిసింది. పోలెపల్లి గ్రామంలో 3విద్యుత్ స్తంభాలు నేలకొరగగా దుద్యాల మండల పరిధిలోని వాల్యానాయక్ తండాలో 12 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఓ స్తంభం ట్రాన్స్‌ఫార్మర్‌పై పడటంతో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. దుద్యాల గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాలతో పాటు గౌరపు మంగమ్మ ఇంటి ముందు వేప చెట్టు విరిగి పడింది. కొడంగల్ పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో గంట పాటు భారీ వర్షం కురిసింది.

కుళ్లిన ఉల్లి

అకాల వర్షాలతో మర్పల్లి మండలంలోని ఉల్లి రైతులకు తీవ్ర నష్టం జరిగింది. రెండు, మూడు రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు పొలాల దగ్గర నిల్వ చేసిన ఉల్లి పంట కుళ్లిపోవడంతో రైతులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. మర్పల్లి మండలంలోని పంచలింగాల, పట్లూర్, దారులపల్లి, మొగిలిగండ్ల, తుమ్మలపల్లితో పాటు తదితర గ్రామాల్లో ప్రతీ ఏటా అధిక సంఖ్యలో ఉల్లి పంటను సాగు చేస్తారు. ఈ ఏడాది కూడా దాదాపు వేయి ఎకరాలకు పైగా సాగు చేశారు. పంట దిగుబడి వచ్చి పొలాల దగ్గరే నిల్వ ఉంచారు. కురిసిన వానకు ఉల్లి పంట కుళ్లిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



వర్షానికి దెబ్బతిన్న ఉల్లి పంట

పిడుగులు పడి ఇద్దరు మృతి

పిడుగు పాటుకు ఆదివారం ముగ్గురు రైతులు దుర్మరణం చెందిన సంఘటన మరవక ముందే మరో వ్యక్తి పిడుగు పాటు గురై మృతి చెందారు. బాలుడికి గాయాలయ్యాయి. సోమవారం మధ్యాహ్నం ఈదురుగాలులు, మెరుపులు, ఉరుములతో కూడిన వర్షం కురుస్తుంది. ఈ క్రమంలో పాత తాండూరుకు చెందిన పూరే శేఖర్ (40) ఇంటి నుంచి బహిర్భూమికి వెళ్లారు. వర్షం వస్తుండడంతో దగ్గరలోనున్న చెట్టు కింద వెళ్లి కూర్చొగా పిడుగు పడింది. శేఖర్ అక్కడికక్కడే మృతి చెందగా అదే ప్రాంతంలో క్రికెట్ ఆడడానికి వచ్చిన బాలుడు హన్మంతు పిడుగు పాటుకు గాయలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబీకులు స్థానికులు కలిసి శేఖర్, హన్మంతులను జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే శేఖర్ మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించగా, బాలుడు చికిత్స పొందుతున్నాడు. అక్కడే కొద్ది దూరంలో ఉన్న మరో వ్యక్తి ప్రాణాలతో బయట పడ్డాడు. అంతేకాకుండా రుద్రారం గ్రామానికి చెందిన పట్లోళ్ల అపర్ణకు చెందిన పొలం చుట్టూ రంగారెడ్డి జిల్లా మంచాల మండలం జాపాల గ్రామానికి చెందిన దొంతరమోని భగవంతు ఫెన్సింగ్ పనులు చేస్తుండగా ఆదివారం రాత్రి వర్షం కురుస్తుండగా పొలంలో పిడుగు పడటంతో భగవంతు కిందపడిపోయాడు. గమనించిన తోటి కూలీలు, అతన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాలకిషన్ తెలిపారు.




మృతి చెందిన మేకలు, గేదె

ఐదు మేకలు, గేదె మృతి

పిడుగు పడి ఐదు మేకలు మృతి చెందిన సంఘటన యాలాల మండల పరిధిలోని హాజీపూర్ శివారు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన మొగులప్ప తనకున్న మేకలను మేత కోసం తోలుకుని అడవికి వెళ్లాడు. వర్షంతో పాటు ఉరుములు , మెరుపులు రావడంతో మేకలన్ని ఒక చెట్టు కింద నిలబడగా మొగులప్ప మరో చెట్టు కింద ఉన్నాడు. ఈక్రమంలో పిడుగు పడి చెట్టు కింద ఉన్న ఐదు మేకలు మృతి చెందాయి. దౌల్తాబాద్ మండలంలో సోమవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. తిమ్మారెడ్డిపల్లి అనుబంధ గ్రామం బంగ్లా తండాలో పిడుగుపడి లక్ష్మనాయక్‌కు చెందిన పాడి గేదె మృతి చెందింది.

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు
- ఇంటర్మీడియట్ అధికారి శంకర్ నాయక్



మాట్లాడుతున్న జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శంకర్ నాయక్

వికారాబాద్, మే 20: ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శంకర్ నాయక్ తెలిపారు. ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సోమవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐవో మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి జూన్ 3 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్ష ఉదయం 9. నుండి 12 గంటల వరకు అదేవిధంగా రెండవ సంవత్సరం పరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు రెండుదఫాలుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. వికారాబాద్‌లో ఆరు పరీక్షా కేంద్రాలు, తాండూరులో నాలుగు, పరిగిలో నాలుగు పరీక్షా కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా నవాబుపేట, పెద్దేముల్, మర్పల్లి, మోమిన్‌పేట, దోమ, కొడంగల్, కుల్కచర్ల మండలాల్లో ఒక్కో పరీక్షా కేంద్రం చొప్పున మొత్తం 20పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం జనరల్, ఒకేషనల్ కలిపి 7831మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతున్నారని తెలిపారు. అందులో ఫస్టియర్ విద్యార్థులు 4621మంది, సెకండియర్ విద్యార్థులు 3210మంది ఉన్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్స్, వాచ్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించొద్దని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ విధించి పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. జిరాక్స్ కేంద్రాలను మూసి వేయించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్టీసీ డిపో మేనేజర్ బిక్షు నాయక్, పోస్టల్ అధికారి పద్మారావు, విద్యుత్ శాఖ ఏడీ రామచంద్రయ్య, ఆర్డీవో డీఏవో గోవిందమ్మ, పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్, జూనియర్ లెక్చరర్ బుచ్చయ్య, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

పరీక్ష ఫీజు గడువు పెంపు: డీఐవో

ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్ష ఫీజు గడువు పెంచినట్లు జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి ఎస్.శంకర్ తెలిపారు. పరీక్ష ఫీజును మంగళవారం(నేడు) వరకు రూ.2వేల అపరాద రుసుముతో చెల్లించవచ్చని తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కళాశాలల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు తెలంగాణ ఇంటర్ బోర్డు ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇంతకు ముందు ఫీజు చెల్లించని విద్యార్థులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యార్థుల యూనిఫాంలు సిద్ధం చేయాలి



మహిళా సంఘాల కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న పీడీ శ్రీనివాస్

పూడూరు, మే 20: విద్యార్థుల యూనిఫాంలు సిద్ధం చేయాలని పీడీ శ్రీనివాస్ ఆదేశించారు. మండలంలోని కేరెళ్లి గ్రామంలో విద్యార్థుల యూనిఫాంను కుడుతున్న మహిళా సంఘాల కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల దుస్తులు కుట్టడంపై మహిళా సంఘాలతో సమావేశమై మాట్లాడారు. పాఠశాలలు తెరిచేలోగా విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీచేసే విధంగా కుట్టుపనిని పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం బందయ్య, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులు అందుబాటులో ఉండాలి

- డీఎల్‌పీవో సంధ్యారాణి



పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో సంధ్యారాణి

కులకచర్ల, మే 20: ప్రస్తుత పరిస్థితుల్లో పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని డీఎల్‌పీవో సంధ్యారాణి తెలిపారు. కులకచర్లలో పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డును సోమవారం పరిశీలించి ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి మురుగు కాల్వల శుభ్రం, తాగునీటి సమస్య ఏర్పడకుండా చూడాలన్నారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా కింది ప్రాంతానికి వెళ్లే విధంగా పంచాయతీ కార్మికులతో తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధిపనులతో పాటు కాల్వల ద్వారా నీరు వెళ్లేవిధంగా శుభ్రం చేయించాలని తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో ప్రజలకు అందుబాటులో ఉంటూ సలహాలు, సూచనలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో కరీం, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.


ఘనంగా సుందరయ్య వర్ధంతి



సుందరయ్యకు నివాళులర్పిస్తున్న నాయకులు

తలకొండపల్లి, మే 20 : ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని వెంకట్రావ్‌పేటలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సీపీఎం జిల్లా నాయకుడు కానుగుల వెంకటయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఎంప్లాయిస్ వాయిస్ పత్రిక ఎడిటర్ కె.వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి అధ్యక్షుడు జగన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సీపీఎం జెండాను ఆవిష్కరించి సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. సుందరయ్య ఆశయ సాధనకు అందరూ కృషిచేయాలని వక్తలు పిలుపునిచ్చారు. తన జీవితాంతం పేదల సమస్యల పరిష్కారానికి, స్త్రీ సమానత్వం, సమాజంలో అసమానతలను రూపుమాపేందుకు, దోపిడీ వ్యవస్థ నిర్మూలనకు సుందరయ్య కృషి చేశారని కొనియాడారు. 17ఏళ్ల పాటు ప్రజాప్రతినిధిగా ప్రజలకు సేవలందించారని పేర్కొన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఎదురొడ్డిన సాహస వీరుడు సుందరయ్య అని వెంకటేశ్వర్లు, జగన్ అన్నారు. ప్రజానాట్యమండలి కళాకారుల ఆటాపాటలు అలరించాయి. కార్యక్రమంలో అంబేద్కర్-పూలే జాతర కమిటీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సుధాకర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు డి.అంజనేయులు, రఘురాములు, చెన్నయ్య, కిశోర్, శివశంకర్, అరుణ్‌కుమార్, శ్రీనివాసులు, వెంకటయ్య పాల్గొన్నారు.

ఉపాధి పనులను నాణ్యతగా చేయాలి



ఉపాధి కూలీల మస్టర్లను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో నరేందర్‌రెడ్డి

యాచారం, మే 20 : వర్షం నీరు నేరుగా భూమిలోకి ఇంకేలా సరిహద్దు కందకాలు తవ్వాలని, మొక్కుబడిగా కాకుండా నాణ్యతగా పనులు చేయాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి కూలీలకు సూచించారు. సోమవారం యాచారంలో కూలీలు చేస్తున్న పనులను పరిశీలించారు. మస్టర్‌పై కూలీల సంతకాలున్నాయా లేదా అని చూశారు. మస్టర్లలో కూలీ సంతకాలు లేకుండా పనులు చేయించొద్దని ఫీల్డ్ అసిస్టెంట్ జంగయ్యను ఆదేశించారు. తాగునీటి వసతి ఏర్పాటు చేస్తున్నారా? మెడికల్ కిట్లు ఉంచుతున్నారా? అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. కూలీలకు ఏమైనా ఇబ్బందులుంటే తనకు తెలియజేయాలని ఆయన సూచించారు.

24న పాలిసెట్



జిల్లా సమన్వయ కర్త ఎం.పరమేశ్వర్

వికారాబాద్, మే 20: పాలిటెక్నిక్ ప్రవేశపరీక్ష(పాలిసెట్)ను మే 24న నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జిల్లా సమన్వయకర్త ఎం.పరమేశ్వర్ తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో 2024 సంవత్సరానికి ప్రవేశాలకు మే 24వ తేదీన (శుక్రవారం) పాలిసెట్ పరీక్ష ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పాలిసెట్ పరీక్ష వికారాబాద్‌లోని మూడు పరీక్షా కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షకు జిల్లాకు చెందిన 1321అభ్యర్థులు అందులో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, కొంపల్లిలో 240మంది, భృంగీ ఇంటర్నేషనల్ స్కూల్, ఎన్నెపల్లిలో 500మంది, శ్రీ అనంత పద్మనాభ డిగ్రీ కళాశాల వికారాబాద్‌లో 481మంది హాజరవుతున్నట్లు తెలిపారు. అభ్యర్థులంతా ఉదయం 10గంటలలోపు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. 11గంటలు దాటిన తర్వాత ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్ష రాయడానికి అనుమతించబడదన్నారు. అభ్యర్థులంతా హాల్‌టికెట్లు తీసుకుని నిర్ణీత సమయంలో పరీక్షకు హాజరుకావాలని సూచించారు.

ఇష్టానుసారంగా చెట్ల నరికివేత



వికారాబాద్, మే 20: వికారాబాద్‌లోని ప్రధాన రోడ్ల గుండా, ఆయా కాలనీలోని ప్రధానిదారుల గుండా చెట్లను విద్యుత్ శాఖ అధికారులు ఇష్టానుసారంగా నరికేస్తున్నారు. దానికి వారి కారణాలు వారికి ఉన్నప్పటికీ ముందుగా మొక్కలు నాటే సమయంలో ఏం చేశారనే వాదనలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు ముందస్తు ప్రణాళిక లేకుండా విద్యుత్ తీగల కింద మొక్కలు నాటడంతో అసలు సమస్య తలెత్తింది. ఫలితంగా ప్రజాధనం వృథా అవుతోంది. మొక్కలు నాటడం వాటిని విద్యుత్ శాఖ అధికారులు తొలగించడం తప్ప వాటి వల్ల ప్రయోజనం ఏముందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వికారాబాద్ చుట్టూ ఉన్న ప్రభుత్వ భూముల్లో మొక్కలు నాటితే బాగుంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు, మునిసిపల్ అధికారుల సమన్వయంతో మొక్కలు నాటితే పెరిగిన చెట్లను నరికే అవకాశం ఉండదని ప్రకృతి ప్రేమికులు అంటున్నారు.

పార్టీ బలోపేతానికి శ్రమించాలి



యువజన కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడికి ఉత్తర్వులను అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం, మే 20: మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త శ్రమించాలని, పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు తప్పక ఉంటుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. సోమవారం మండల యువజన కాంగ్రెస్ నూతన కమిటీకి నియామక ఉత్తర్వులు అందజేశారు. నాయకులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను కాంగ్రెస్ అనుకూలురు దక్కించుకునేలా కార్యకర్తలంతా కృషిచేయాలన్నారు. పదవులు ముఖ్యంకాదని, అధిష్ఠించిన పదవితో ప్రజా సేవచేస్తూ తగిన న్యాయం చేయాలన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ పదవుల్లో పార్టీ అభ్యర్థులు గెలిచేలా కార్యకర్తలు కృషిచేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతీ పేద కుటుంబానికి దక్కేలా చూడాలన్నారు. మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, రమేష్, సంయుక్త కార్యదర్శులు నర్సింహ, రాజు, కార్యదర్శి అర్జున్, ప్రధాన కార్యదర్శిగా అజయ్‌లను నియమించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మస్కు నర్సింహ, మోటే శ్రీశైలం. వి.తిరుమలేష్, మురళి, బాలశివుడు, జగన్‌మోహన్‌రెడ్డి, శేఖర్, సుధాకర్, గాల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



బషీరాబాద్ తహసీల్దార్ ఎదుట ఆందోళనకు దిగిన బాధిత మహిళలు


కోర్టు ఆర్డర్ ఉంటే భూమి రిజిస్ట్రేషన్ ఎలా చేశారు?

- తహసీల్దార్ కార్యాలయంలో బాధితుల ఆందోళన
- వెంట పెట్రోల్ డబ్బా తెచ్చుకుని బెదిరించే యత్నం
- లాక్కొని బయట పడేసిన రెవెన్యూ సిబ్బంది

బషీరాబాద్, మే 20: కోర్టుఆర్డర్ ఉండగా తమ కుటుంబానికి చెందిన భూమిని ఎలా రిజిస్ట్రేషన్ చేశారంటూ బాధిత మహిళ, ఇద్దరు కూతుర్లు బషీరాబాద్ తహసీల్దార్ కార్యాయంలో సోమవారం సాయంత్రం ఆందోళనకు దిగారు. అంతటితో ఆగకుండా వెంట తెచ్చుకున్న పెట్రోల్ డబ్బాను తీసి మాకు న్యాయం జరగకుంటే ఇక్కడే పెట్రోల్ పోసుకుని చస్తామని బెదిరించారు. దీంతో అక్కడే ఉన్న సిబ్బంది పెట్రోల్ డబ్బాను లాక్కొని బయట పడేశారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని దామర్‌చెడ్ గ్రామానికి చెందిన ఆశన్‌పల్లి మాణెమ్మకు సుమారు పదెకరాల భూమి ఉంది. ఆమెకు లక్ష్మి, అమృతమ్మ, శృతి అనే ముగ్గురు కూతుర్లు ఉన్నారు. రెండో కూతురు అమృతమ్మ, భర్త బాల్‌రాజ్ కలిసి 2020లో తన తల్లి మాణెమ్మకు మాయమాటలు చెప్పి 7.20 ఎకరాల వరకు భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు బాధిత మహిళలు ఆరోపించారు. ఈ ఆస్తిలో తమ ముగ్గురు అక్కాచెల్లెళ్లకు సమాన వాటా ఇస్తుందని, అప్పట్లో తమ తల్లి మాణెమ్మతో కలిసి కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఇంటిరియమ్ ఇంజక్షన్ ఆర్డర్ తీసుకువచ్చి కార్యాలయంలో ఇచ్చినట్లు లక్ష్మి, శృతి తెలిపారు. ఈ భూమిపై ఎలాంటి లావాదేవీలు జరపవద్దని సదరు అడ్వకేట్‌తో కలిసి ఆర్డర్ కాపీని అప్పట్లో ఇక్కడా పనిచేసిన తహసీల్దార్‌కు ఇచ్చినట్లు తెలిపారు. కోర్టు ఆర్డర్ ఉన్నా తమ భూమి సర్వేనంబర్లు బ్లాక్‌లో పెట్టించిన ఈనెల 4వ తేదీన ఆ భూమి రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని తహసీల్దార్ వై.వెంకటేష్‌తో వాగ్వాదానికి దిగారు. తాను ఎన్నికల విధుల్లో ఉన్నానని ఆభూమి హక్కు కలిగిన వ్యక్తులు స్లాట్‌బుక్ చేసుకుంటే రిజిస్ట్రేషన్ చేసి ఉండవచ్చని తహసీల్దార్ బాధిత మహిళలకు వివరించారు. తాము అప్పట్లో కోర్టు ఆర్డర్ కాపీ ఇచ్చి సర్వే నంబర్లు బ్లాక్‌లో పెట్టిస్తే ఎలా ఓపెన్ అయి రిజిస్ట్రేషన్ జరిగిందంటూ వారు తహసీల్దార్‌తో వాదనకు దిగారు. అంతటితో ఆగకుండా బాధిత మహిళ వెంట తెచ్చుకున్న పెట్రోల్ డబ్బా తీసి మాకు న్యాయం జరగకుంటే ఇక్కడే పెట్రోల్ పోసుకుని చస్తామని బెదిరించింది. దీంతో అక్కడున్న సిబ్బంది తీసుకుని బయట పడేశారు. ఈ విషయమై తహసీల్దార్ వై.వెంకటేష్‌ను వివరణ కోరగా కోర్టు ఆర్డర్ ఉన్నట్లు తనకు తెలియదని, కోర్టు ఆర్డర్ కాపీని కార్యాలయంలో ఎప్పుడు ఇచ్చారో కూడా తెలియదని చెప్పారు. రిజిస్ట్రేషన్ ఆథారిటీ డిప్యూటీ తహసీల్దార్‌కు ఉందని, సదరు యజమాని స్లాట్ బుక్ చేసుకుంటే రిజిస్ట్రేషన్ చేసి ఉండొచ్చని తెలిపారు. బాధిత మహిళలకు తాము ఎం చేయలేమని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పాస్ బుక్కులు జారీ కాకుండా చూస్తానని బాధిత మహిళలకు ఆయన భరోసానిచ్చారు.

విద్యార్థులకు ఉచిత కార్పొరేట్ విద్య

- ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు అవకాశం
- ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ



చేవెళ్ల, మే 20: ప్రభుత్వ పాఠశాలల్లో చదవి పదో తరగతిలో కనీసం 7జీపీఏ సాధించిన విద్యార్థులకు కార్పొరేట్ కాలేజీల్లో ఇంటర్మీడియట్ కోర్సు ఉచితంగా చదివే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. విద్యార్థుల దరఖాస్తులను పరిశీలించి మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం 2024-25లో ఇంటర్మీడియట్‌లో అవకాశం కల్పిస్తారు. కాగా కార్పొరేట్ కాలేజీల్లో చేరే విద్యార్థుల ఫీజును ప్రభుత్వమే కాలేజీల యాజమాన్యాలకు చెల్లిస్తుంది. ఒక్కో విద్యార్థికి ఫీజు కింద ఏటా రూ.35వేల చొప్పున యాజమాన్యాలకు చెల్లించడంతో పాటు విద్యార్థి ఖర్చులకు ఏటా రూ.3వేలు(రెండేళ్లకు రూ.6వేలు) అందజేస్తుంది. మీసేవ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో ఈ నెల 30వ తేదీ కల్లా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు సమయంలో ప్రాధాన్యత క్రమంలో మూడు కాలేజీలను విద్యార్థులు ఎంపిక చేసుకోవాలి. జూన్ 3న ఎంపిక జాబితాను ప్రకటిస్తారు. 6 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుంది.

ఎంపిక విధానం ఇలా..

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థులకు ఉచిత కార్పొరేట్ విద్యను అందించేందుకు ఈ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. టెన్త్‌లో సాధించిన జీపీఏను లెక్కలోకి తీసుకుంటూనే రిజర్వేషన్లను అమలు చేస్తారు. ఓపెన్ కేటగిరీలో మాత్రం మెరిట్ చూస్తారు. ఎంపికైన విద్యార్థులకు కార్పొరేట్ కళాశాల వివరాలతో కూడిన సమాచారం ఇస్తారు. విద్యార్థులు నిర్ణీత గడువులోగా కేటాయించిన కాలేజీలో చేరాల్సి ఉంటుంది.

ఈ పథకానికి అర్హులు ఎవరంటే..

- 2023-24 అకడమిక్ ఇయర్‌లో ప్రభుత్వం పాఠశాలల్లో పదో తరగతి చదవి పరీక్షలో కనీసం 7జీపీఏ, ఆ పైన గ్రేడ్ సాధించాలి.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, మైనార్టీ, ఈబీసీ(ఆర్థికంగా పేదలు) వర్గాలకు చెందిన వారై ఉండాలి.
- జెడ్పీ, ఎయిడెడ్, కేజీబీవీ, నవోదయ, గురుకులాలు, ఆదర్శ పాఠశాలలు, బెస్ట్ అవైలబుల్ స్కీం కింద చదవిన వారు దరఖాస్తు చేసుకోవాలి.

నియమ నిబంధనలు ఇలా

తల్లిదండ్రుల వార్షికాదాయ పత్రాన్ని దరఖాస్తుతో జతచేయాలి. గ్రామీణ ప్రాంతాల వారికి రూ. 1.5లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2లక్షలకు మించి వార్షికాదాయం మించరాదు. రిజర్వేషన్లకు(కుల), స్థానిక ధ్రువపత్రాలు జతచేయాలి. దివ్యాంగులు సదరం సర్టిఫికెట్‌ను జతచేయాలి. బ్యాంకు పాస్‌బుక్, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్‌ఫొటో, ప్రభుత్వ స్కూల్లలో చదివినట్లు కనీసం మూడేళ్ల బోనాఫైడ్‌ను జత చేయాలి.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదివి 7 జీపీఏపైగా గ్రేడ్ సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. సీట్లు కేటాయించబడ్డ విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలలో సీట్లతో పాటు అన్ని వసతులకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. 2024-25 విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈనెల 30వ తేది లోపు ఆన్‌లైనలో దరఖాస్తు చేసుకోవాలి.

- అక్బర్, ఎంఈవో, చేవెళ్ల

పీర్జాదిగూడ పీఠంపై హై డ్రామా!



- బల నిరూపణకు మేయర్ సిద్ధం
- క్యాంప్ రాజకీయాలు షురూ
- విహారయాత్రకు బీఆర్ఎస్ కార్పొరేటర్లు?
- అప్రమత్తమైన కాంగ్రెస్.. ఔటర్‌పై సినీ ఫక్కీలో చేజింగ్
- పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఫిర్యాదు

హైదరాబాద్ సిటీ/పీర్జాదిగూడ, మే 20(ఆంధ్రజ్యోతి): పీర్జాదిగూడ మేయర్ అవిశ్వాసంపై హైడ్రామా కొనసాగుతోంది. బలనిరూపణకు బీఆర్ఎస్ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి తానే అవిశ్వాస ప్రతిపాదన చేశాడు. కలెక్టర్‌కు ఆయన చేసిన విజ్ఞప్తి మేరకు జూన్ 5న అవిశ్వాసం పెట్టాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో క్యాంప్ రాజకీయాలకు తెరలేచింది. అవిశ్వాసం నెగ్గేందుకు బీఆర్ఎస్.. మెజార్టీ కార్పొరేటర్ల మద్దతుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఆదివారం రాత్రి వెంకట్‌రెడ్డి తమ కార్పొరేటర్లను దగ్గరుండి విహారయాత్రకు పంపేందుకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్తున్నాడు. ఔటర్ రింగ్ రోడ్డుపైకి వారంతా కార్లలో వెళ్తుండగా.. గమనించిన కార్పొరేటర్లు వారి వెనకే వెళ్లారు. వెంకట్‌రెడ్డి తీసుకెళ్తున్న కార్పొరేటర్లలో కొందరిని ఒప్పించి తమ వైపునకు తిప్పుకునేందుకు కాంగ్రెస్ నాయకులు ప్రయత్నం చేశారని చెబుతున్నారు. ఈ క్రమంలో ఔటర్‌పై సినీ ఫక్కీలో వాహనాల చేజింగ్ జరిగింది. హయత్‌నగర్ వద్ద ఔటర్ ఎక్కిన ఇరు పార్టీల కార్పొరేటర్ల వాహనాలు.. రింగ్ రోడ్డు మొత్తం తిరిగి ఘట్‌కేసర్ వద్ద ఓఆర్ఆర్ దిగాయి. కొందరు ఇప్పటికే క్యాంప్‌నకు తరలగా.. ఇంకొందరిని ఎవరికి వారు తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

16 నుంచి 8కి బీఆర్ఎస్ బలం

పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో 26డివిజన్లున్నాయి. 2020లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ 16స్థానాల్లో విజయం సాధించగా.. కాంగ్రెస్3, బీజేపీ1, స్వతంత్రులు ఆరుగురు గెల్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో ఇక్కడి రాజకీయ పరిణామాలు పూర్తిగా మారాయి. ఎనిమిది మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో బీఆర్ఎస్ కార్పొరేటర్ల సంఖ్య ఎనిమిదికి పడిపోయింది. అనూహ్యంగా మేయర్ వెంకట్‌రెడ్డి బలనిరూపణకు సిద్ధమయ్యారు. అప్రమత్తమైన కాంగ్రెస్ క్యాంప్‌నకు వెళ్తున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లను తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నం చేసినట్టు సమాచారం. తమ కార్పొరేటర్లను భయపెట్టి, ప్రలోభానికి గురి చేసేందుకు గుండాలతో వెంబడించారని వెంకట్‌రెడ్డి ఆరోపించారు.

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

ఔటర్‌పై జరిగిన చేజింగ్‌పై బీఆర్ఎస్ పీర్జాదిగూడ ప్రధాన కార్యదర్శి ఎదవల్లి రఘువర్ధన్ సోమవారం ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జక్క వెంకట్‌రెడ్డి, తమ పార్టీ కార్పొరేటర్లపై దాడి, కిడ్నాప్‌నకు యత్నించారని పేర్కొన్నారు. అవిశ్వాసం నెగ్గలేక సుధీర్‌రెడ్డి వెనకుండే ఈ తతంగాన్ని నడిపిస్తున్నాడని ఆరోపించారు. కార్పొరేటర్ అమర్‌సింగ్, ఆయన అనుచరుల ద్వారా సుధీర్‌రెడ్డి ఇదంతా చేయిస్తున్నాడన్నారు. అమర్‌సింగ్‌ను పావుగా వాడుకొని క్యాంపు రాజకీయాలు చేయించిన సుధీర్‌రెడ్డి కోట్ల రూపాయలు ఖర్చు చేయించాడని, ఈ క్రమంలోనే అవిశ్వాసం వీగిపోయేలా వారు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఔటర్‌పై సీసీ ఫుటేజీ పరిశీలిస్తే ఏం జరిగిందో అర్థమవుతుందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఫుట్‌పాత్ అక్రమణలపై కదలిక

- పోలీస్, మున్సిపల్ శాఖ సంయుక్తంగా చర్యలు
- నేటి నుంచి గీత దాటొద్దు
- ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



అక్రమణలను తొలగించాలని సూచిస్తున్న పోలీస్, మున్సిపల్ సిబ్బంది

తాండూరు, మే 20: తాండూరులో ఫుట్ పాతుల అక్రమణలపై అధికార యంత్రాగం కదిలింది. విధి వ్యాపారులు రోడ్లను అక్రమించుకొని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా తమ వ్యాపారాన్ని చేసుకోవాలని వీధి వ్యాపారులకు పోలీస్, మున్సిపల్‌శాఖ వారు సూచించారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఇందిరా చౌక్ నుంచి శాంత్ మహల్ చౌరస్తా, బస్టాండ్ నుంచి శివాజీ చౌక్ వరకు పోలీస్, మున్సిపల్ శాశా సంయుక్తంగా చర్యలకు శ్రీకారం చుట్టింది. తోపుడు బండ్లు, కూరగాయల గంపలు, దుకాణదారులు ముందుగా వేసిన షెడ్లు, ఎక్కడబడితే అక్కడ కూర్చునే కూరగాయ వ్యాపారులు మంగళవారం నుంచి పోలీస్ మున్సిపల్ శాఖ గీసిన గీతకు లోపలే ఉండి వ్యాపారం చేసుకోవాలని సూచించారు. గీత దాటి వ్యాపారం చేసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానా విధిస్తామని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు. ఇందిరాచౌక్‌లో అడ్డదిడ్డంగా నిలుపుతున్న తోపుడుబండ్ల వల్ల ట్రాఫిక్ అంతరాయం కలుగుతోందని పలువురు వాపోతున్నారు. మంగళవారం ఉదయం నుంచే రోడ్లను ఆక్రమించకుండా వ్యాపారం చేసుకోవాలని సూచించారు. పాత కూరగాయల మార్కెట్ గాంధీచౌక్ రోడ్డు మార్గంలోనూ ఆక్రమణలను నియంత్రించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తాండూరు అర్బన్ సీఐ సంతోష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు, మున్సిపల్ సిబ్బంది చర్యలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.



ఢిల్లీలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

కాంగ్రెస్ అంటేనే కన్ఫ్యూజన్ పార్టీ

- చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- ఢిల్లీలో ఎన్నికల ప్రచారం

రంగారెడ్డి అర్బన్, మే 20 : కాంగ్రెస్ అంటేనే ఒక కన్ఫ్యూజన్ పార్టీ అని, ఆ పార్టీ నాయకుల్లో ఎప్పుడు ఎవరేం మాట్లాడుతారో, ఎవరిని సమర్థిస్తారో, ఎవరితో పొత్తు పెట్టుకుంటారో తెలియదని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆ పార్టీలో అంతా గందరగోళమే అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఆరో విడతలో ఎన్నికలు జరిగే ఢిల్లీలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో సోమవారం విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల లోక్‌సభ స్థానం ప్రజలు అసెంబ్లీ ఎన్నికలతో సంబంధం లేకుండా, పార్టీలకు అతీతంగా మొన్న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ వైపు మొగ్గు చూపారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో డిపాజిట్లు రాని చోట బీజేపీకి భారీ మెజార్టీ రానుందని ధీమా వ్యక్తం చేశారు. రాజ్యాంగం గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. 31శాతం దళితులే ఉన్న రాయ్‌బరేలి నియోజకర్గంలో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఆ వర్గానికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వలేదన్నారు. ఆ స్థానాన్ని గాంధీ కుటుంబానికి రిజర్వ్ చేసుకున్నారని ఆరోపించారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అరెస్టు చేయాలని గగ్గోలుపెట్టిన కాంగ్రెస్ పార్టీ అదే లిక్కర్ కేసులో అరెస్టు అయిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు మద్దతివ్వడం హాస్యాస్పందం అన్నారు. దేశ రాజధాని ప్రజలంతా బీజేపీకే మరోసారి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు.

బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



వికారాబాద్, మే 20: బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో చదువుకునేందుకు గిరిజన బాల బాలికలు దరఖాస్తు చేసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. జిల్లా వాస్తవ్యులైన గిరిజన బాల బాలికల నుంచి 2024-25 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ 3, 5, 8వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 64సీట్లు ఖాళీలు ఉండగా 3వ తరగతిలో 32 ఖాళీలకు గానూ లంబాడా బాలురు 18, బాలికలు 11, చెంచులకు మూడు ఖాళీలు(బాలుర 1, బాలికలు 2) ఉన్నట్లు తెలిపారు. 5వ తరగతిలో 16ఖాళీలకు గానూ 10లంబాడా బాలురుకు, నలుగురు బాలికలకు చెంచులకు 2 (బాలుర 1, బాలిక 1) చొప్పున కేటాయించినట్లు తెలిపారు. అదేవిధంగా 8వ తరగతిలో 16ఖాళీల్లో లంబాడా బాలురు 11, బాలికలు 4ఖాళీలుండగా ఒక చెంచు బాలికకు అవకాశం ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన వారు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఒక కుటుంబం నుంచి ఒక్కో విద్యార్థికి మాత్రమే బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో అవకాశం ఉంటుందని అన్నారు. తల్లిదండ్రులు వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతం వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంత వారికి రూ.2లక్షల లోపు ఉండాలన్నారు. కుల, ఆదాయ, నివాసం ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ సర్టిఫికెట్, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల బోనఫైడ్‌తో పాటు పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో దరఖాస్తు సమర్పించాలని తెలిపారు. మే 21 నుంచి జూన్ 6వ తేదీ వరకు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తులు పొంది జూన్ 6వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కార్యాలయ పరిధిలో తమ దరఖాస్తులను సమర్పించాలన్నారు. జూన్ 12వ తేదీన లాటరీ విధానంలో విద్యార్థుల ఎంపిక ఉంటుందని చెప్పారు. ఎంపికైన విద్యార్థుల జాబితా జూన్ 13న జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయంలో ప్రదర్శించబడుతుందని వివరించారు. పాఠశాలలో ప్రవేశానికి అవకాశం వచ్చిన వారు జూన్ 14న విద్యార్థులు పాఠశాలలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఏదైనా సమాచార నిమిత్తం 9948663053 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



కడీలను తొలగిస్తున్న గ్రామస్తులు

పాఠశాల స్థల ఆక్రమణను అడ్డుకున్న గ్రామస్తులు

షాద్‌నగర్ రూరల్, మే 20: ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద ఉన్నత పాఠశాల స్థలాన్ని ఆక్రమించుకునేందుకు కొందరు యత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లంపల్లికి చెందిన ఓ వ్యక్తికి సర్వే నంబరు 339లో భూమి ఉంది. అయితే సోమవారం పాఠశాల స్థలం ఉన్న సర్వే నంబరు 287 భూమి రెండు ఎకరాలకు రాతి కడీలు పాతేందుకు పనులు మొదలు పెట్టాడు. ఇది తెలుసుకున్న గ్రామస్తులు స్థలం వద్దకు చేరుకొని పాతిన కడీలను తొలగించేశారు.

‘ప్రత్యేక’ పట్టింపేది?



పంట పొలాల్లో పారబోసిన చెత్త

- పంచాయతీల పాలనాబాధ్యత ప్రత్యేకాధికారులది
- ప్రజా సమస్యలను పట్టించుకోని అధికారులు
- గ్రామాల్లో పర్యటనలు నిల్!
- ఎక్కడికక్కడ పేరుకుపోతున్న సమస్యలు




మేడిపల్లిలో నిర్వహణ లేని నీటి తొట్టి



పూడిక పేరుకున్న మురుగు కాలువ

యాచారం, మే 20: పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం కొన్ని నెలల కింద ముగియడంతో గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కరించేందుకు ప్రభుత్వం గ్రామాలకు మండల/డివిజన్ స్థాయిల అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించింది. ఈ స్పెషల్ ఆఫీసర్లు గ్రామాల్లో అందుబాటులో ఉన్న ఉద్యోగులు, సిబ్బందితో పనులు చేయించాల్సి ఉంది. ప్రతీ వారం గ్రామాన్ని సందర్శించి పర్యవేక్షించాలి. అయితే అధికారులు ప్రత్యేక అధికారిగా బాధ్యతలు అప్పగించినప్పటి నుంచి ఇప్పటి వరకు తమకు కేటాయించిన గ్రామాలవైపు కన్నెత్తి చూడలేదు. ఇదేమని అడిగితే ఎన్నికల సాకు చూపారు. మొన్నటి వరకు ఎన్నికల పనులున్నా ఇప్పుడైతే ఎలాంటి అదనపు బాధ్యతలు లేవు. ఎన్నికలు ముగిసి ఐదారు రోజులవుతున్నా అధికారులు గ్రామాలపై పట్టించుకోవడం లేదు. యాచారం మండలంలో 24 పంచాయతీలున్నాయి. ప్రత్యేకాధికారులు పంచాయతీ బాధ్యతలను తలకు మించిన భారంగా భావించి పట్టించుకోవడం లేదు. పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించి 4 నెలలవుతున్నా వారు గ్రామ సందర్శనలు చేపట్టడం లేదు. కొందరు మొక్కుబడిగా పంచాయతీలోకి వెళ్లి సందర్శించినట్టు రిజిష్టర్‌లో సంతకం చేసి వెళ్తున్నారు తప్పితే ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను పట్టించుకోవడం లేదు. గ్రామంలో నీటి సమస్య, పారిశుధ్య పనులు, సిబ్బంది పనితీరుపై పర్యవేక్షణ తదితర బాధ్యతలు చూసుకోవాల్సి ఉన్నా వాటిగురించి నిర్లక్ష్యం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులకు పనులు అప్పగించి వెళ్తున్నారు. కాగా పంచాయతీల్లో చేపట్టే పనులకు నిధుల ఖర్చు కోసం పంచాయతీ సెక్రటరీ, ప్రత్యేకాధికారికి జాయింట్ చెక్‌పవర్ ఉంది. అధికారి సంతకం చేస్తేనే పనులకు బిల్లులు డ్రా చేసుకునే వీలుంది. అయితే గ్రామాల్లో అధికారి వారానికోసారైనా అందుబాటులో లేకపోవడంతో చేయాల్సిన పనులు కూడా నిలిచిపోతున్నాయి. కాగా ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఎంపీవో ఉమారాణి రెండురోజులకోసారి గ్రామాలను సందర్శించి సమస్యలు తెలుసుకుంటున్నారు. చౌదర్‌పల్లిలో అంగన్‌వాడీ కేంద్రానికి నీటి వసతి లేక పడుతున్న ఇబ్బందులను గుర్తించి ఎంపీడీవో వెంటనే నీటి కనెక్షన్ ఇప్పించారు. నర్సరీల సంరక్షణకు కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చారు. వానకాలంలో గ్రామాల్లో అతిసార, డయేరియా వంటి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచిస్తున్నారు.

గ్రామాల సమస్యలు పరిష్కరిస్తున్నాం



నేను, ఎంపీవో ఉమారాణి వారంలో రెండు మూడు రోజులకోమారు గ్రామాల కెలుతున్నాం, జనం ఎదుర్కుంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించగలుగుతున్నాం. గ్రామాలకు వెళ్లని ప్రత్యేకాధికారులను గ్రామాలకు పంపుతా. తాను ఇప్పటికే మండలంలోని ప్రతి గ్రామం సందర్శించాను. తాగు నీటి సమస్య ఏ గ్రామంలో లేదు. మురుగు కాలువలను వారం వారం శుభ్రం చేయిస్తున్నాం.

- నరేందర్‌రెడ్డి, ఎంపీడీవో

ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో స్థలాలను కొనుగోలు చేసి మోసపోవద్దు

శామీర్‌పేట, మే 20 : తూంకుంట పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో స్థలాలు కొనుగోలు చేసి మోసపోవద్దని తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకట్ గోపాల్ ప్రజలకు సూచించారు. సోమవారం ఆయన ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. చెరువు కబ్జాకు గురవుతుందని పలువురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి పెద్ద చెరువును సందర్శించి ఎఫ్‌టిఎల్‌ను గుర్తించి హద్దురాళ్లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎఫ్‌టీఎల్ నుంచి 30 మీటర్ల లోపు ఎలాంటి అక్రమ నిర్మాణాలు ఉన్నా వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎఫ్‌టీఎల్ నుంచి 30మీటర్ల వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని చెప్పారు. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు మాయ మాటలు చెప్పి ఎఫ్‌టీఎల్ భూమిని విక్రయించి మోసం చేయాలని చూస్తున్నారని, ప్రజలు అలాంటి వారిని నమ్మొద్దని తెలిపారు. చెరువు సమీపంలో స్థలాలు కొనుగోలు చేసేవారు సంబంధిత అధికారులను తెలుసుకున్న అనంతరం కొనాలని చెప్పారు. స్థలం తక్కువధరకు వస్తుందని గొనుగోలు చేసి మోసపోవద్దన్నారు. బఫర్ జోన్‌లో ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీసీల రిజర్వేషన్లు తేల్చాకే ఎన్నికలు నిర్వహించాలి

బషీరాబాద్, మే 20: బీసీల కులగణన, రిజర్వేషన్ల లెక్కలు తేల్చిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జడల అనంతయ్యగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం విలేఖర్లతో మట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి బీసీ కులగణన చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఆదిశగా చర్యలు తీసుకోవాలన్నారు. జనాభాలో అధిక శాతం ఉన్న బీసీల రిజర్వేషన్ల కేటాయింపులో అన్యాయం జరగకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

● ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి

తాండూరు, మే 20: పిడుగుపాటుతో మృతిచెందిన కుటుంబాలను ఆదుకుంటామని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. తాండూరు జిల్లా ఆస్పత్రిలో సోమవారం బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సాయాన్ని అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సాయం త్వరగా వచ్చేలా చూడాలని తాండూరు ఆర్డీఓను ఆదేశించారు. ఆయన వెంట యాలాల మండల నాయకులు సిద్రాల శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్ అబ్దుల్ రజాక్, కాంగ్రెస్ యువనాయకులు రఘు, అశోక్, సిద్దు, తదితరులు ఉన్నారు.


తాండూరు: మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

యాలాల: మండల పరిధిలోని జుంటుపల్లి, బెన్నూర్ గ్రామాల్లో ఆదివారం పిడుగుపాటుకు మృతి చెందిన కుటుంబాలకు సోమవారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆర్థిక సాయాన్ని అందజేశారు. జుంటుపల్లిలో పిడుగుపాటుకు మృతి చెందిన మంగళి శ్రీనివాస్ కొన్నింటి లక్ష్మప్ప, బెన్నూర్‌లో గొల్ల ఎంకప్ప కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సాయాన్ని వారివారి పార్టీ అనుచరుల ద్వారా కుటుంబాలకు చేరవేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నర్సిరెడ్డి, మాజీ అధ్యక్షుడు భీమప్ప, కాంగ్రెస్ నాయకులు సిద్రాల శ్రీనివాస్, హన్మంతు, లక్ష్మప్ప, బీఆర్ఎస్ నాయకులు రవీందర్ రెడ్డి, కృష్ణ కుమార్ ఉన్నారు.


తాండూరు: జుంటుపల్లిలో లక్ష్మప్ప భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి


ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తరుపున మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేస్తున్న యాలాల మండల కాంగ్రెస్ నాయకులు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

బొంరాస్‌పేట్, మే 20: రోడ్డుప్రమాదంలో ఓవ్యక్తి మృతిచెందిన ఘటన బొంరాస్‌పేట్‌లో ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాందర్‌పూర్ నుంచి కోస్గి వైపు వెళ్తుండగా అనంతపూర్ సమీపంలో నాందర్‌పూర్ చెరువుకు ఏటి కాల్వవంతెన కింద ఓవ్యక్తి బైక్‌తో పాటు కింద పడిపోయి మృతిచెందాడు. టీఎస్ 34 బీ 6440 నెంబరు గల ద్విచక్రవాహనం మృతుడి పక్కనే ముళ్ల పొదల్లో పడిఉంది. సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి ఆ వంతెన పక్కన ఉన్న మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన రావడంతో అటుగా వెళ్తున్న వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ సిబ్బందితో అక్కడికి చేరుకొని ఘటనాస్థలాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న బైక్ నెంబరు ద్వారా విచారణ చేపట్టగా దోమ మండలం దాదాపూర్ గ్రామానికి చెందినదిగా గుర్తించారు. ముఖంపూర్తిగా కుళ్లిపోవడంతో మృతుడి ఆచూకీ తెలియడం లేదని ఎస్ఐ తెలిపారు. ఎవరైనా గుర్తిస్తే మృతుడి వివరాలు తెలిసేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గేట్ దిమ్మె కూలిపడి చిన్నారి దుర్మరణం

షాద్‌నగర్ రూరల్, మే 20 : తోటి పిల్లలతో ఆడుకుంటూ బాలిక గేట్ దిమ్మెను పట్టుకోగా అది కూలిపడి బా లిక మృతిచెందిన విషాదకర ఘటన ఫరూఖ్‌నగర్ మండలం మధురాపూర్ లో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మల్లేష్-రమాదేవి దంపతుల కూతురు సాక్షి(4) ఆడుకుంటూ ఇంటి ముందు ఉన్న ప్రహరీగోడ గేటు దిమ్మెను పట్టుకుంది. దిమ్మెను బలహీనంగా కట్టడం తో ముట్టుకోగానే బాలిక తలపై పడిం ది. సాక్షి తలపై పెళ్లలు పడి తల పగిలి అక్కడికక్కడే మృతిచెందింది. కళ్ల ముందే కూతురి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

కొత్తూర్, మే 20: కొత్తూరులో నివాసం ఉంటున్న బికేష్‌సింగ్(34) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్ఐ జి.శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ఈ నెల 12న బికేష్‌సింగ్ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతడి గాలించారు. ఎంతకూ ఆచూకీ దొరక్కపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. బికేష్‌సింగ్ తల్లి ఉర్మిళదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. బికేష్‌సింగ్ అచూకీ తెలిసిన వారు 8712568296 ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

కారు బోల్తా.. త్రుటిలో తప్పిన పెను ముప్పు

ఆమనగల్లు, మే 20: కారు అదుపు తప్పి డివైడర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు బెలూన్‌లు తెరుచుకోవడంతో త్రుటిలో కారులోని వారికి ప్రాణాపాయం తప్పింది. ఆమనగల్లులో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి ఈ ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెం దిన నలుగురు హైదరాబాద్ నుంచి ఆమనగల్లు మీదుగా శ్రీశైలం వెళ్తున్నారు. రాత్రి 2:30గంటల సమయంలో ఆమనగల్లు బస్టాండ్ వద్ద రహదారి డివైడర్‌కు కారు ఢీకొని పల్టీ కొట్టింది. డివైడర్‌కు ఉన్న స్ట్రీట్‌లైట్స్ స్థంభం విరిగిపోయింది. డివైడర్ కూలిపోయి కారు నుజ్జునుజ్జు అయ్యింది. బోల్తా పడిన కారులో బెలూన్స్ ఓపెన్ కావడంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆ సమయంలో రహదారిపై ఎవరూ లేకపోవడంతో మరింత ముప్పు తప్పింది.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

మోమిన్‌పేట్, మే 20: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని డీసీవో ఈశ్వరయ్య అన్నారు. మండలంలోని మేకవనంపల్లి గ్రామంలో సోమవారం ఆయన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రానికి వచ్చే రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని లారీల్లో మిల్లులకు తరలించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం బస్తాలను వెంటనే రైసుమిల్లులకు తరలించాలన్నారు. అకాల వర్షాల కారణంగా తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే లారీల్లో లోడ్‌చేసేందుకు అవసర మైన లారీలను కేంద్రాలకు పంపిస్తామని తెలిపారు. వారం రోజుల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకు తొమ్మిది లారీల వరిధాన్యం కొనుగోలు చేశామని, ఇంకా ఆరు లారీల ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని తెలిపారు. జొన్నలను కొనుగోలు చేయడంలో అలసత్వం వహించరాదన్నారు. ఈ కార్యక్రమంలో మేకవనంపల్లి సొసైటీ సీఈవో బాలకృష్ణ, మోమిన్‌పేట్ సొసైటీ శేఖర్, సిబ్బంది సురేందర్ రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.


మేకవనంపల్లిలో కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీవో ఈశ్వరయ్య

పార్కు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

ఘట్‌కేసర్, మే 20: మండలంలోని చౌదరిగూడ శ్రీనివాసనగర్ కాలనీలోని పార్కుస్థలాన్ని కాపాడాలని కాలనీవాసులు సోమవారం ఎంపీడీఓ, ఎంపీపీ, గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. కాలనీలోని 400చదరపు గజాలపార్కు స్థలం ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడంలేదని వివరించారు. దీంతో ఎంతో విలువైన ప్రభుత్వస్థలం నిరుపయోగంగా ఉండటం వల్ల కొంతమంది ఆక్రమణకు ప్రయత్నాలు చేస్తున్నారని వాపోయారు. పార్కుస్థలాన్ని కాపాడేందుకు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు సూచిక బోర్డులు పెట్టాలని కోరారు. ఖాళీగా ఉన్న పార్కుస్థలంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలునాటి సంరక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. చౌదరిగూడకు వచ్చిన ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డిని సోమవారం కలిసిన కాలనీవాసులు పార్కు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

కులకచర్ల, మే 20: కులకచర్లలో తాగునీటి సమస్య ఏర్పడకుండా తగుచర్యలు తీసుకుంటామని ఎంపీటీసీ ఆనందం తెలిపారు. గ్రామపరిధిలో గల తాగునీరు అందించే బావుల్లో పూడికతీత పనులను సోమవారం ఆయన పరిశీలించారు. గ్రామ పరిధిలోని అన్ని కాలనీలకు నీరందిస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ ఆధీనంలో ఉన్న నీరందించే బావుల్లో పూడికతీత పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ నీటితో పాటు గ్రామపరిధిలోని బోరు బావుల నుంచి ప్రజలకు తాగు నీరందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తాగునీటి సమస్య ఎదుర్కొకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డుసభ్యుడు వెంకటేశ్ పాల్గొన్నారు.


కులకచర్లలో బావిలో పూడిక తీత పనులను పరిశీలిస్తున్న ఎంపీటీసీ ఆనందం

ఆలయ నిర్మాణానికి విరాళాలు


ఆలయ కమిటీకి విరాళం అందజేసిన మన్మోహన్ సర్దా

బషీరాబాద్, మే 20: మండల కేంద్రంలో రూ.కోటిన్నర వ్యయంతో నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయ నిర్మాణానికి ఇద్దరు దాతలు విరాళాలు అందజేస్తున్నారు. తాండూరు పట్టణానికి చెందిన రామపుల్లారావు రూ.30వేలు, మన్మోహన్ సర్దా రూ.11వేలు ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు సాయిల్‌గౌడ్‌కు సోమవారం స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు వడ్డేశ్రీను, ఉల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

28న మండల సాధారణ సర్వసభ్య సమావేశం

మూడుచింతలపల్లి, మే 20: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 28వ తేదీన ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు మూడుచింతలపల్లి ఎంపీడీవో వత్సలాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడుచింతలపల్లి గ్రామపంచాయితీ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

ప్రైవేట్ పాఠశాలలను నమ్మి విద్యార్థుల తల్లిదండ్రులు మోసపోవద్దు

కొడంగల్ రూరల్, మే 20: కొడంగల్ నియోజకవర్గంలో కొత్త కొత్త పేర్లతో పుట్టుకొస్తున్న ప్రైవేట్ పాఠశాలలను నమ్మి విద్యార్థుల తల్లిదండ్రులు మోసపోవద్దని ఎంఐఎం పార్టీ కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్కే.గుల్షన్ అన్నారు. ఆయన సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కొడంగల్‌తో పాటు నియోజకవర్గంలో ఫీజుల దోపిడీకి కొత్తకొత్త పేర్లతో పాఠశాలలను ఏర్పాటు చేస్తూ తమ పాఠశాలల్లో పిల్లలను చదివించాలన్నారు. అన్ని వసతులను కల్పిస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. దీంతో ఇంతకు ముందు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను తల్లిదండ్రులు కొత్త పాఠశాలల్లో వేయడంతో పిల్లల చదువుకు ఆటంకం ఏర్పడుతుందన్నారు. ఒకే పాఠశాలలో పిల్లలను చదివించడంతో వారి విద్యాభ్యాసం సక్రమంగా కొనసాగుతుందన్నారు. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తుకు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులకు లక్ష్యనిర్దేశం

● జూన్ 12 వరకు డెడ్‌లైన్

తాండూరు, మే 20: అమ్మ ఆదర్శ పాఠశాల కింద మంజూరైన పనులను పూర్తిచేసేందుకు ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. జూన్ 12వ తేదీ లోపు పనులన్నీ పూర్తిచేయాలని డెడ్‌లైన్ విధించారు. ప్రస్తుతం పాఠశాలలకు సెలవులు అయినప్పటికీ ప్రధానోపాధ్యాయులు, పాఠశాల కమిటీల అధ్యక్షులు దగ్గరుండి పనులు చేయిస్తున్నారు. విద్యార్థులకు అవసరమయ్యే వసతుల కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మున్సిపాలిటీలో కమిషనర్, మండలాల్లో ఎంపీడీవోలు ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు. కలెక్టర్ నారాయణరెడ్డి ఎన్నికలు ఉన్నప్పటికీ ఈ పనుల విషయంలో ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి పనులు చేయిస్తున్నారు. జూన్ 12లోపు పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ నిధులతో పాఠశాలలో తాగునీటి వసతి, విద్యుత్, సరఫరా, మరుగుదొడ్ల మరమ్మతులు, శానిటేషన్ పనులను చేయించాలి. ఈ పనులకు రూ.25వేల నుంచి రూ.లక్ష వరకు మంజూరయ్యాయి. తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలో తాండూరు మున్సిపాలిటీ, పెద్దేముల్, యలాల, బషీరాబాద్, తాండూరు, కోట్‌పల్లి మండలాలున్నాయి. ఎంఈవోలతో సమన్వయం చేసుకుంటూ కమిషనర్‌లు, ఎంపీడీవోలు పనులను వేగవంతం చేశారు. పట్టణంలో మెప్మా, మండలాల్లో ఐకేపీ మహిళా సంఘాల సమన్వయంతో పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. నిధులు లేక వసతులు లేక ఇబ్బందులు ఉన్న పాఠశాలలకు ఈ నిధులు వనంలా మారాయి. జిల్లా ఆదర్శంగా నిలిచేలా త్వరగా పనులు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు కోరుతున్నారు.


పనులపై సమీక్షిస్తున్న బషీరాబాద్ ఎంపీడీవో

ఆలయాల్లో వైభవంగా కల్యాణోత్సవాలు

మేడ్చల్ టౌన్, మే 20: మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, బీరప్ప కామరాతీ దేవి కల్యాణోత్సవ కార్యక్రమం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ వేడుకల్లో పాల్గొనడానికి మేడ్చల్ పట్టణానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీసులు పొందారు. ప్రతీ సంవత్సరం వైభవంగా నిర్వహించే బీరప్ప కామరాతీదేవి కల్యాణోత్సవంలో పాల్గొనటానికి విచ్చేసే భక్తుల కోసం నిర్వాహకులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, పీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్ పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ పట్టణ మాజీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు శివకుమార్ యాదవ్, స్వామి యాదవ్, కౌడె మహేస్ పాల్గొన్నారు.


స్వామి వారిని దర్శించుకుంటున్న పీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్

పార్కు స్థలాన్ని కాపాడాలి


డీఎల్‌పీవో సాంబిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అవుషాపూర్ గ్రామస్తులు

ఘట్‌కేసర్ రూరల్, మే 20: పార్కుస్థలం కాపాడాలని అవుశాపూర్ గ్రామస్తులు సోమవారం డీఎల్‌పీవో సాంబిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అవుషాపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్లు 253, 255, 256, 257, 261, 262, 263, 264 పార్టుల్లోని దాదాపు 70ఎకరాల్లో 1985లో 600ప్లాట్లు చేశారు. న్యూసిటీ పేరుతో మూడు సెక్టార్లలో వెంచర్ చేశారు. వెంచర్ చేసిన సమయంలో పబ్లిక్ ప్లేగ్రౌండ్(పబ్లిక్‌పార్కు) కోసం 2400గజాల స్థలాన్ని వదిలిపెట్టారు. పంచాయతీ అధికారులు పార్కుస్థలంలో హరితహారం మొక్కలు నాటి బోర్డు ఏర్పాటుచేసి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. కాగా, పార్కును 2016లో విజయ ఎడ్యుకేషనల్ సొసైటీ పేరుతో రిజిస్ట్రేషన్ చేశారు. విజయ ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకుడు రాజు ఆదివారం తాను కొనుగోలు చేసిన స్థలాన్ని చదును చేస్తుండటంతో స్థానికులు అడ్డుకున్నారు. దీంతో సోమవారం అవుషాపూర్ గ్రామానికి చెందిన పన్నాల కొండల్‌రెడ్డి, బిక్షపతిగౌడ్, సందీప్‌రెడ్డి, మేడబోయిన జంగయ్య, వామన్‌రెడ్డి, వీరేషం, శ్రీనివాస్‌గౌడ్, దయాకర్‌రెడ్డి తదితరులు పార్కుస్థలాన్ని కాపాడాలని డీఎల్‌పీవోను విజ్ఞప్తి చేశారు.

నడిరోడ్డుపై తోపుడు బండ్లు

● పట్టణంలో ఇష్టానుసారంగా వ్యాపారాలు
● పట్టించుకోని మున్సిపల్, పోలీస్ యంత్రాంగం

వికారాబాద్, మే 20: వికారాబాద్ పట్టణంలో రోజు రోజుకు పెరుగుతున్న జనాభాతో ట్రాఫిక్ సమస్య అధికమైంది. ఏళ్లుగా వికారాబాద్‌లో ప్రధాన రోడ్డుపై తోపుడు బండ్ల వ్యాపారులు పండ్లు అమ్ముకుంటూ వ్యాపారం చేస్తున్నారు. గతంలో ఒక రోడ్డుపై పండ్లు ఉంటే మరో రోడ్డుపై ప్రజలు తిరుగుంటే ఇప్పుడు రెండు రోడ్లకు ఇరువైపులా సగం రోడ్డుపై అవే బండ్లు దర్శనమిస్తున్నాయి. వారి కోసం గతంలో పండ్ల మార్కెట్ ఏర్పాటు చేస్తామని చెప్పిన నాయకుల మాటలు హామీలకే పరిమితమవుతున్నాయి. వారిని ఆ మార్కెట్‌కు పంపించిన దాఖలాలు లేవు. దీంతో నిత్యం ప్రయాణికులు ఆ బండ్లతో ఇబ్బందులు పడుతున్నారు. కూరగాయల మార్కెట్ మాదిగి పండ్ల మార్కెట్ ఏర్పాటుచేస్తే అవసరం ఉన్న వారు అక్కడికి వెళ్లి పండ్లు కొనుగోలు చేస్తారని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఆ బండ్లను రోడ్లపై నుంచి తొలగించి ఒక మార్కెట్ ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


వికారాబాద్ రోడ్ల మధ్యలో పండ్ల వ్యాపారులు

ఎప్‌సెట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి అభినందన


విద్యార్థిని నవ్యరెడ్డిని సన్మానిస్తున్న కౌన్సిలర్ లావణ్య

తాండూరు, మే 20: ఎప్‌సెట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని బీజేపీ మహిళా నాయకురాళ్లు అభినందించారు. మండలంలోని బెన్నూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మి దంపతుల కుమార్తె నవ్యరెడ్డి ఎప్‌సెట్‌లో 864ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థిని మహిళా మోర్చా ప్రతినిధులు శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ బంటారం లావణ్య, జిల్లా ఉపాధ్యక్షులు రేణుక, పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు అర్చనలు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఘట్‌కేసర్, మే 20: ఘట్‌కేసర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్లకొమ్మలు తొలగించడానికి నేడు (మంగళవారం) ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ సతీష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో యంనంపేట్, తిరుమల వెంచర్, వసంతవ్యాలీకాలనీ, శ్రీరాం ఎన్‌క్లేవ్, ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, విహారిహోమ్స్, జయనగర్, హెవెన్స్‌కాలనీ, శ్రీనివాసనగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు చెట్ల కొమ్మల తొలగింపునకు శివారెడ్డిగూడ విద్యుత్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు. దీని కారణంగా శివారెడ్డిగూడ, మారుతినగర్, మైసమ్మగుట్ట, తహసీల్దార్ కార్యాలయ పరిసరాలు, యాదాద్రి రెసిడెన్సీ, ఘణాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వివరించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ సతీష్ కుమార్ ఈ సందర్భంగా కోరారు.

కొడంగల్: దుద్యాల 33 కేవీ విద్యుత్ ఫీడర్‌పై పోల్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ నవీన్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నర్సాపూర్, గుండ్లకుంట, పాత కొడంగల్, కొండారెడ్డిపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా కొడంగల్ మండలంలోని పెద్దనందిగామ సబ్‌స్టేషన్‌లో మరమ్మ తుల కారణంగా పెద్దనందిగామ, చిన్ననందిగామ, నందారం, ప్యాలమద్ది, హుసేన్‌పూర్, బుర్జుకాన్‌పల్లి గ్రామాల్లో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

యువతకు ఉచిత శిక్షణ

తాండూరు రూరల్, మే 20 మండలంలోని జినుగుర్తిలో వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యువతకు వాలీబాల్ ఉచిత శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈనెల 17నుంచి ప్రారంభమైన శిక్షణ జూన్ 5వ తేదీ వరకు ఈ శిక్షణ కొనసాగుతుందని, గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ స్కూల్ ప్రాంగణంలో కేంద్రం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 5.30గంటల నుంచి 8.30గంటల వరకు, సాయంత్రం 4.30గంటల నుంచి సాయంత్రం 7.30గంటల వరకు శిక్షణ కొనసాగుతుందని తెలిపారు.

చేవేళ్లలో కాంగ్రెస్ గెలుపు ఖాయం

నవాబుపేట, మే 20: పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని మైతాప్‌ఖాన్‌గూడ మాజీ సర్పంచ్ అనితారంగారెడ్డి అన్నారు. ఆమె సోమవారం నవాబుపేట మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకే మద్దతు తెలిపారని, ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పథకాలతో ప్రజలకు మేలని తెలిపారు.

సహకార సంఘంలో రుణాలు చెల్లించిన ముగ్గురు డైరెక్టర్లు

ఘట్‌కేసర్, మే 20: ఘట్‌కేసర్ సహకార సంఘం రుణాలు తీసుకొని చెల్లించని జాబితాలో ఉన్న నలుగురు డైరక్టర్లకు అధికారులు నోటీసులు పంపిన సంగతి తెలిసిందే. ఈ మేరకు నలుగురు డైరెక్టర్లలో ముగ్గురు డైరెక్టర్లు రుణాలను చెల్లించారు. రుణాలు తీసుకున్న వారిలో గోపు బాల్‌రాజ్, గ్యార వెంకటేష్, ఒంగూరి లక్ష్మమ్మ బకాయిలను చెల్లించినట్లు సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బకాయిలు చెల్లించాల్సిన జాబితాలో ధర్మారెడ్డి మిగిలి ఉన్నట్లు స్పష్టం చేశారు. ఈ విషయాన్ని జిల్లా సహకర శాఖ అధికారికి వివరించామని తెలిపారు.